సాక్షి
కాకినాడ

సోమవారం । 14 । జూలై । 2025



రూ.లక్ష విరాళం


తుని రూరల్: తలుపులమ్మ తల్లి లోవ దేవస్థానం అభివృద్ధికి దాసరి నాగేశ్వరరావు, బుల్లెమ్మ దంపతల కుమారుడు సాయినాయుడు (పిల్లపాలెం) ఆదివారం రూ.1,00,116 విరాళం అందజేశారు.



నిత్యాన్నదానానికి..

ఇంద్రకీలాద్రి: విజయవాడ దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి భోగవరపు సత్యనారాయణ, ఝాన్సీలక్ష్మి, కుటుంబ సభ్యులు (రాజమహేంద్రవరం) ఆదివారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.

డెల్టాలకు 14,200 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 14,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 6,800 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్ కుమార్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. కాకినాడలో ఆదివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చింతా ప్రదీప్ కుమార్, బండి నూకరాజు మాట్లాడారు. ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న 3 డీఏలు తక్షణం మంజూరు చేయాలని, 2023 జూలై నుంచి 12వ పీఆర్‌సీ అమలు చేయాలని, పీఆర్‌సీని నియమించి, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్ శ్రీనివాస్, కన్వీనర్ వాకాడ వెంకట రమణ, కృష్ణకుమార్, మనోహర్, మంగారావు త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలకు పాతర

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఉపాధ్యాయులపై పని భారం పెంచి, విద్యా ప్రమాణాలకు కూటమి ప్రభుత్వం పాతర వేస్తోందని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి విమర్శించారు. కాకినాడలో ఆదివారం నిర్వహించిన ఎస్‌టీయూ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులను బోధనకు దూరం చేసి విద్యారంగానికి తీరని నష్టం చేస్తున్నారని, తరగతి గదిలో ప్రశాంతంగా పాఠం చెప్పే పరిస్థితి నేడు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే గిన్నిస్ బుక్ రికార్డుల కోసం యోగాంధ్ర, మెగా పీటీఎం వంటి కార్యక్రమాలు నిర్వహించి ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ పథకాల ఆన్‌లైన్ ఉపాధ్యాయులే చేయాలన్నది ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. మొబైల్ ఫ్రీ క్లాస్ రూం విధానాన్ని అమలులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఏలేరు ఆయకట్టుకు నీరు విడుదల

ఏలేశ్వరం: ఖరీఫ్ సాగుకు ఏలేరు రిజర్వాయర్ నుంచి ఆదివారం 1,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు జలాశయంలో నీటి నిల్వలు స్వల్పంగా పెరిగాయి. ఎగువ నుంచి 1,357 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 86.56 మీటర్లు కాగా 77.47 మీటర్లుగా నమోదైంది. పూర్తి స్థాయి సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 10.68 టీఎంసీల మేర నీటి నిల్వలున్నాయి. విశాఖకు 150, తిమ్మరాజు చెరువుకు 50 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

దారులన్నీ తలుపులమ్మ సన్నిధానానికే..



లోవ క్యూలైన్లలో కిక్కిరిసిన భక్తులు

తుని రూరల్: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి తలుపులమ్మ తల్లిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో దారులన్నీ కిక్కిరిసిపోయాయి. ఆషాఢ మాసం మూడో ఆదివారం.. అమ్మవారిని విశేషంగా ఆరు టన్నుల కూరగాయలతో శాకంబరిగా అలంకరించడంతో భక్తులు తండోపతండాలుగా లోవ దేవస్థానానికి తరలివచ్చారు. తీవ్రమైన రద్దీతో 16వ నంబరు జాతీయ రహదారి నుంచి లోవ ఆర్చి గేటు వరకూ పలుమార్లు ట్రాఫిక్ స్తంభించిపోయింది. సాయంత్రం ఆరు గంటలకు కూడా భక్తులు ప్రత్యేక వాహనాల్లో రావడంతో తిరుగు ప్రయాణంలో ఉన్న భక్తులకు ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు. పోలీసులు ఎన్ని ఏర్పాట్లు చేసినా మందుబాబుల ఆగడాలు.. వాహనాలు నిలిపివేయడంతో గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. క్యూ లైన్లన్నీ కిక్కిరిసిపోవడంతో కొంతమంది భక్తులు బాలాలయంలోనే అమ్మవారిని దర్శించి, కనిపించిన ప్రతి చెట్టుకూ ఉపారాలు సమర్పించారు. లక్ష మంది వరకూ భక్తులు రాగా క్యూలైన్ల ద్వారా ఉదయం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు అమ్మవారిని 50 వేల మంది దర్శించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.5,51,700, పూజా టికెట్లకు రూ.6,92,720, కేశఖండన శాలకు రూ.62,500, వాహన పూజలకు రూ.3,340, వసతి గదుల అద్దెలు రూ.1,09,892, విరాళాలు రూ.2,83,244 కలిపి మొత్తం రూ.17,03,396 ఆదాయం లభించిందని వివరించారు. భక్తులకు తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించామన్నారు. రూరల్ సీఐ జి.చెన్నకేశవరావు, ఎస్సై కృష్ణమాచారి ఆధ్వర్యాన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎస్సైలు, ఏఎస్సైలు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రవేశాలు



జిల్లాలో కాకినాడ వుమెన్స్, పిఠాపురం రాజా (పీఆర్), ఎంఎస్‌ఎన్ చారిటీస్ ఎయిడెడ్, పెద్దాపురం మహారాణి డిగ్రీ కాలేజీలతో పాటు పిఠాపురం, పెరుమాళ్లపురం, ఏలేశ్వరం, జగ్గంపేట, తుని, తొండంగిల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలున్నాయి. అలాగే, పలు ప్రైవేటు డిగ్రీ కళాశాలలు కూడా ఉన్నాయి. వీటిల్లో బీఏ, బీఎస్సీ, బీకామ్, కంప్యూటర్స్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అన్ని డిగ్రీ కళాశాలలూ కలిపి జిల్లాలో సుమారు 20 వేల సీట్లు ఉన్నాయి.



పిఠాపురంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

- నెలలు గడుస్తున్నా డిగ్రీ అడ్మిషన్లపై అయోమయం
- ప్రభుత్వ కళాశాలల్లో ప్రారంభం కాని ప్రవేశాలు
- అగమ్యగోచరంగా విద్యార్థుల భవిష్యత్తు
- ప్రైవేటు కళాశాలల్లో అనధికారికంగా తరగతులు
- సర్కారు చర్యలు కార్పొరేట్‌కు కలిసొచ్చేలా ఉన్నాయని విమర్శలు

పిఠాపురం: విద్యా రంగాన్ని ప్రైవేటు విద్యా సంస్థలకు ధారాదత్తం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాలు వచ్చి మూడు నెలలు గడచింది. కానీ, ప్రభుత్వం ఇప్పటి వరకూ డిగ్రీ ప్రవేశాల ఊసే ఎత్తడం లేదు. దీంతో, ఇంటర్ పాసయిన విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. డిగ్రీ అడ్మిషన్ల కోసం వారు ఎదురు చూస్తున్నా ప్రభుత్వం మాత్రం వ్యవహారం నెలల తరబడి ఎటూ తేల్చడం లేదు.

ప్రైవేటు గాలం

ప్రభుత్వం డిగ్రీ అడ్మిషన్లపై స్పష్టత ఇవ్వకపోవడాన్ని అవకాశంగా తీసుకున్న ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు విద్యార్థులకు గాలం వేశాయి. ప్రభుత్వ ఆదేశాలతో పని లేకుండా విద్యార్థులకు అడ్మిషన్లు కూడా ఇచ్చేస్తున్నాయి. ఒకవేళ ఆప్షన్లలో తమ కళాశాలలో సీటు రాకపోయినా ఇతర కళాశాలలతో మాట్లాడుకుని ఇక్కడే ఉండేలా చూసుకుంటామంటూ భరోసా ఇచ్చి మరీ విద్యార్థులను చేర్చుకుంటున్నారు. వారి నుంచి దండిగా ఫీజులు కూడా వసూలు చేస్తున్నారు. అడ్మిషన్లతో పాటు అనధికారికంగా డిగ్రీ తరగతులు కూడా నిర్వహించేస్తున్నారు. ప్రభుత్వం అడ్మిషన్ల ప్రక్రియ మొదలు పెట్టిన తర్వాత కోరుకున్న కోర్సుల్లో విద్యార్థులకు అవకాశం ఇచ్చేలా కూడా ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు గణనీయంగా తగ్గిపోతాయని అధ్యాపకులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు కళాశాలల్లో అడ్మిషన్లు పెంచడానికే ప్రభుత్వం ఇలా జాప్యం చేస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. ఏది ఏమైనా ఆర్థిక స్తోమత లేని విద్యార్థులు మాత్రం ప్రభుత్వ కళాశాలల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

గందరగోళ విధానాలతో..

వాస్తవానికి ఇంటర్ ఫలితాలు విడుదలైన వెంటనే డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టాలి. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు సైతం వెలువడినప్పటికీ ఈ విద్యా సంవత్సరంలో డిగ్రీ అడ్మిషన్లపై ఇప్పటి వరకూ స్పష్టత రాలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో డిగ్రీ అడ్మిషన్లు ఆన్‌లైన్‌లో నిర్వహించేవారు. ఇప్పుడు ఆన్‌లైన్‌లోనా లేక ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తారా అనే విషయమై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. అలాగే, సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానాన్ని తొలగించి డబుల్ మేజర్ సబ్జెక్ట్స్ విధానం తెస్తున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించింది. మళ్లీ కొద్ది రోజులకే సింగిల్ సబ్జెక్టు విధానం కొనసాగించాలని నిర్ణయించారు. మొత్తంమీద ఈ ఏడాది డిగ్రీ సిలబస్‌కు సంబంధించి ఉన్నత విద్యా మండలి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెబుతున్నారు. దీంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చేరాలనుకుంటున్న వందలాది మంది విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. దీనిపై త్వరితగతిన నిర్ణయం తీసుకుని, డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియను తక్షణమే చేపట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఉన్నత విద్య పట్ల ఇంత గందరగోళంగా వ్యవహరించడం సరికాదని విద్యారంగ నిపుణులు విమర్శిస్తున్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులు తగ్గే అవకాశం



అడ్మిషన్ల ప్రక్రియపై నేటికీ స్పష్టత లేకపోవడంతో విద్యార్థులు పలు ప్రైవేటు కళాశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే పలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ల సంఖ్య తక్కువగా ఉంటోంది. ఇప్పుడు మరింత ఆలస్యం చేస్తూండటంతో ఆ సంఖ్య మరింత తగ్గే అవకాశం ఏర్పడుతుంది.

– వడ్డి కాసులు , విద్యార్థి, కాకినాడ


అడ్మిషన్లు వెంటనే చేపట్టాలి



విధానం ఏదైనప్పటికీ డిగ్రీ అడ్మిషన్లు వెంటనే చేపట్టాలి. ఇప్పటికే ఇంటర్ పూర్తయి, డిగ్రీ అడ్మిషన్ల కోసం మూడు నెలలుగా ఎదురు చూస్తున్నాం. అడ్మిషన్ల ప్రక్రియ ఆలస్యం చేయడం వల్ల చాలా ఇబ్బంది పడుతున్నాం. ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్ విధానంలో వెంటనే అడ్మిషన్లు ప్రారంభించి, తరగతులు ప్రారంభించేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి.

– జి.చిన్ని, డిగ్రీ అడ్మిషన్ల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థి, కాకినాడ

క్లాసులు ఇంకెప్పుడు?



ఇంటర్ ఫలితాలు వచ్చి మూడు నెలలైంది. ఒకవైపు అన్ని తరగతులూ ప్రారంభమైనా ఇప్పటికీ డిగ్రీ అడ్మిషన్లు లేవు. అడ్మిషన్లు ఇంకెప్పుడు ఇస్తారు? క్లాసులు ఎప్పుడు ప్రారంభిస్తారు? విద్యార్థులు మూడు నెలల విలువైన విద్యా కాలాన్ని కోల్పోయారు. ఒకవేళ అడ్మిషన్లు ఇచ్చినా మరో నెలవరకూ క్లాసులు ఉండవు. దీంతో విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతుంది. ఏ నిర్ణయమైనా అడ్మిషన్లకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం త్వరగా తీసుకోవాలి. అంతే కానీ, ఇంకా ఆలస్యం చేయడం చూస్తుంటే ప్రైవేటు కళాశాలలకు లబ్ధి కలిగించడానికేనా అనే అనుమానాలు వస్తున్నాయి.

– కె.సిద్దు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సంయుక్త కార్యదర్శి

మరిడమ్మా.. కరుణించమ్మా..



ప్రత్యేక అలంకరణలో మరిడమ్మ అమ్మవారు

పెద్దాపురం: ఆషాఢ మాస జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం మరిడమ్మ తల్లిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. ఆలయం వద్ద భారీ క్యూలలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు లక్ష మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు అంచనా వేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలూ కలగకుండా ఆలయ ట్రస్టీ చింతపల్లి శ్రీహర్ష, అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యాన సిబ్బంది ఏర్పాట్లు చేశారు. డీఎస్పీ శ్రీహరిరాజు ఆదేశాల మేరకు సీఐ విజయ్ శంకర్ పర్యవేక్షణలో ఎస్సై మౌనిక ఆధ్వర్యాన పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పెద్దాపురం బ్రాహ్మణ సేవా సంఘం, సామర్లకోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన భక్తులకు పులిహోర పంపిణీ చేశారు. చాచా విద్యా నికేతన్ ఆధ్వర్యాన అన్నదానం నిర్వహించారు.



ఆలయం వద్ద భక్తుల సందడి

బాక్స్
బద్ధలవుతుందనే భయంతో..

- బాక్స్ టెండర్లు నిలిపివేసిన అధికారులు
- ఆన్‌లైన్ టెండర్లకు ఆమోదం

సాక్షి ఇంపాక్ట్

పిఠాపురం: ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన పాలకవర్గాన్ని పక్కన పెట్టి, అధికారం ఉంది కదా అని ఇష్టమొచ్చినట్లు చేయాలనుకున్న కూటమి నేతల ప్రయత్నాలు బెడిసికొట్టాయి. తమ నేత మంజూరు చేసిన నిధులతో తామే పనులు చేయాలంటూ పట్టుబట్టి.. అధికారులపై ఒత్తిడి తెచ్చి.. ఆయా కాంట్రాక్టులు తమకే దక్కేలా చేసుకునేందుకు వారు చేసిన కుంతంత్రాలు చెల్లలేదు. వారి ఒత్తిడికి తలొగ్గి, పాలకవర్గాన్ని కాదని కొందరు అధికారులు చేసిన ప్రయత్నాలను కింది స్థాయి అధికారులు సైతం ఒప్పుకోలేదు. దీంతో, దిగివచ్చిన అధికారులు చివరకు నిబంధనల ప్రకారం పనులు చేయించక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిఠాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి కొన్నాళ్ల కిందట రూ.3 కోట్లు విడుదల చేశారు. తమకు కలసి వచ్చేందుకు వీలుగా ఈ పనులకు ఆన్‌లైన్‌లో కాకుండా బాక్స్ టెండర్లు పిలవాలని జనసేన నేతలు అధికారులపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చారు. ఆ మేరకు అధికారులు బాక్స్ టెండర్లకు రంగం సిద్ధం చేశారు. దీనిని మున్సిపల్ పాలకవర్గం వ్యతిరేకించింది. అయినప్పటికీ లెక్క చేయకుండా మున్సిపల్ అధికారులు బాక్స్ టెండర్లకే మొగ్గు చూపారు. దీనిపై ఆమోదిస్తే బాక్స్ బద్దలే.. శీర్షికన గత నెల 28న సాక్షి కథనం ప్రచురించింది.



పిఠాపురం మున్సిపల్ కార్యాలయం

దీంతో, దిగి వచ్చిన అధికారులు ఎట్టకేలకు బాక్స్ టెండర్లను నిలిపివేసి, ఆన్‌లైన్ టెండర్లకు ప్రకటన విడుదల చేశారు. అయినప్పటికీ గత పది రోజులుగా ఏదో ఒక విధంగా బాక్స్ టెండర్లు వేసేలా చూడాలని జనసేన నేతలు అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. దీనికి ఒక జిల్లా ఉన్నతాధికారి కూడా మద్దతు పలకడంతో మున్సిపల్ అధికారులు బాక్సు టెండర్లకు ఏర్పాట్లు చేశారు. ఈవిధంగా నిబంధనలకు వ్యతిరేకంగా బాక్స్ టెండర్లు పిలిస్తే తాము బలైపోతామని మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగపు అధికారులు ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీనికి ఎట్టి పరిస్థితుల్లోనూ తాము ఒప్పుకోబోమని వారు స్పష్టం చేశారు. దీనికితోడు కోర్టును ఆశ్రయించేందుకు పాలకవర్గం సిద్ధమైంది. చివరకు గత్యంతరం లేని పరిస్థితుల్లో మున్సిపల్ అధికారులు ఆన్‌లైన్ టెండర్లు పిలుస్తూ శనివారం ప్రకటన జారీ చేశారు. ఆదివారం సాయంత్రం నుంచి టెండర్లు స్వీకరణకు ఏర్పాట్లు చేశారు.

పవన్.. కాకినాడ సెజ్‌ను మరిచారా ?


- పరిశ్రమలు పెట్టండి
- లేదా ఆ భూమిని పేదలకివ్వండి
- సీపీఐ నేత తాటిపాక మధు



పొన్నమండ రామచంద్రరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కాకినాడ సిటీ: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాకినాడ సెజ్‌పై ఇచ్చిన హామీలు మరిచారా అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు ప్రశ్నించారు. ఇచ్చిన హామీ ప్రకారం కాకినాడ సెజ్ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, లేదంటే ఆ భూములను పేదలకివ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక పొన్నమండ రామచంద్రరావు భవన్‌లో ఆదివారం జరిగిన సీపీఐ కాకినాడ నగర 23వ మహాసభలో ఆయన పాల్గొన్నారు. ముందుగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, సీనియర్ నాయకుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పొన్నమండ రామచంద్రరావు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం మధు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సెజ్‌లో పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తాయని అంతా ఎదురు చూస్తున్నారన్నారు. కానీ, ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదని అన్నారు. సెజ్ ఏర్పాటు చేసి 19 ఏళ్లు గడుస్తున్నా పరిశ్రమలు రాకపోగా ఆ భూములన్నీ ఖాళీగానే ఉన్నాయన్నారు. పట్టుమని పదెకరాల్లో కూడా కార్యకలాపాలు కనిపించడం లేదన్నారు. చైనాకు చెందిన పల్స్‌ప్లష్ అనే సంస్థ బొమ్మల తయారీ యూనిట్ నడుపుతోందన్నారు. మరో మూడు ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు మాత్రమే ఉన్నాయని చెప్పారు. కొందరు మహిళలకు మాత్రమే వీటిలో ఉపాధి లభిస్తోందన్నారు. కాకినాడ పెట్రో కారిడార్ పేరిట పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకొస్తామని కేంద్ర ప్రభుత్వం ఎన్నో ఏళ్లగా హామీలు కురిపించడం తప్ప పనులు జరిగిన దాఖలాలు లేవని విమర్శించారు. రైతుల నుంచి భూములు తీసుకున్న ఉద్దేశం నెరవేరలేదన్నారు. సెజ్ రైతుల సమస్యల పరిష్కారానికి గత ఏడాది నవంబర్ 4న పిఠాపురం పర్యటన సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కాకినాడ సెజ్‌లో పరిశ్రమలు తెచ్చేందుకు చర్యలు తీసుకోనున్నట్లు గత ఏడాది జూలై 3న జరిగిన బహిరంగ సభలో సైతం హామీ ఇచ్చారని చెప్పారు. ఇక్కడి ప్రజలు గెలిపించిన తరువాత పిఠాపురం ప్రజలకు కృతజ్ఞతలు తెలిపేందుకు పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ బస్టాండ్ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో సైతం పవన్ కల్యాణ్ సెజ్ గురించి ప్రస్తావించారని అన్నారు. కానీ, ఏళ్లు గడుస్తున్నా సెజ్‌లో పరిశ్రమల జాడ కనిపించడం లేదని, పరిశ్రమలు వస్తే పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎదురు చూస్తున్న యువత ఆశలపై పాలకులు నీళ్లు జల్లుతున్నారని విమర్శించారు. స్మార్ట్ కరెంటు మీటర్ల బిగింపును వ్యతిరేకించాలని, బిల్లులు పెంచేందుకే వీటిని బిగించేందుకు సిద్ధమవుతున్నారని, వీటి రద్దుకు ఊరంతా ఏకమవ్వాలని, స్మార్ట్ మీటర్లు బద్దలుగొట్టాలని మధు పిలుపునిచ్చారు. పప్పు ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, నగర కార్యదర్శి టి.అన్నవరం, మహిళా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.భవాని తదితరులు కూడా ప్రసంగించారు.

శాకంబరీ.. కారుణ్యమూర్తీ..



భక్తవరదాయినిగా ఖ్యాతికెక్కిన తలుపులమ్మ అమ్మవారిని.. ఆషాఢ మాసం మూడో ఆదివారాన్ని పురస్కరించుకుని శాకంబరి దేవిగా అలంకరించారు. దీనికోసం అమలాపురానికి చెందిన అర్లపల్లి శివ, ఏలూరి అయ్యప్ప ఆరు టన్నుల కూరగాయలు వితరణ చేశారని లోవ దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. గర్భాలయంలో స్వయంభువుగా వెలసిన అమ్మవారిని, పంచలోహ విగ్రహాలను కూరగాయలతో అలంకరించి, జీడిపప్పుతో కిరీటం అమర్చామని చెప్పారు. శాకంబరి అలంకరణలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తన్మయులయ్యారు.

– తుని రూరల్

రత్నగిరికి భక్తుల తాకిడి

- సత్యదేవుని దర్శించిన 25 వేల మంది
- దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. స్వామివారిని సుమారు 25 వేల మంది దర్శించి, పూజలు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలకు సెలవు కావడంతో ఉదయం నుంచే వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలు భక్తులతో నిండిపోయాయి. సత్యదేవుని ఉచిత దర్శనానికి రెండు గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో సుమారు 5 వేల మంది భక్తులకు సత్యదేవుని అన్నప్రసాదం స్వీకరించారు.

ఘనంగా రథ సేవ

రత్నగిరిపై సత్యదేవుని రథసేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పండితులు ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చి రథం మీద వేంచేయించారు. అర్చకులు దత్తాత్రేయశర్మ, గణేష్ తదితరులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. కొబ్బరికాయ కొట్టి ప్రాకారసేవ ప్రారంభించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాకారంలో సేవ నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు నీరాజనం ఇచ్చి, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్సవమూర్తులను తిరిగి ప్రధానాలయానికి చేర్చారు.



సత్యదేవుని పాత నమూనా ఆలయం వద్ద ప్రసాదం కోసం బారులు తీరిన భక్తులు

1.10 లక్షల ప్రసాదం ప్యాకెట్ల విక్రయం

ఆషాఢ మాసం మూడో ఆదివారం కావడంతో సత్యదేవుని గోధుమ నూక ప్రసాదం ప్యాకెట్ల విక్రయాలు రికార్డు స్థాయిలో జరిగాయి. ఈ ఒక్క రోజే 1.10 లక్షల ప్రసాదం ప్యాకెట్లు విక్రయించారు. సత్యదేవుని ఆలయానికి వచ్చిన భక్తులకు రత్నగిరిపై సుమారు 30 వేల ప్రసాదం ప్యాకెట్లు విక్రయించారు. మిగిలిన 80 వేల ప్యాకెట్లను లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారి దర్శనానికి వెళ్లిన భక్తులు తిరుగు ప్రయాణంలో కొనుగోలు చేశారని దేవస్థానం అధికారులు తెలిపారు. 150 గ్రాముల ప్రసాదం ప్యాకెట్ రూ.20 చొప్పున లక్ష ప్యాకెట్లకు గాను దేవస్థానానికి రూ.20 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. లోవ దేవస్థానానికి వెళ్లిన భక్తులు తిరుగు ప్రయాణంలో సత్యదేవుని ప్రసాదం కొనుగోలు చేసేందుకు పోటీ పడ్డారు. దీంతో, కొండ దిగువన తొలి పావంచా వద్ద, పాత, కొత్త నమూనా ఆలయాల వద్ద రద్దీ నెలకొంది. తొలి పావంచా వద్ద, జాతీయ రహదారిపై సత్యదేవుని పాత నమూనా ఆలయం వద్ద చెరో 30 వేలు.. కొత్త నమూనా ఆలయం వద్ద 10 వేల చొప్పున ప్రసాదం ప్యాకెట్లు విక్రయానికి ఉంచారు. రాత్రి ఏడు గంటల సమయానికే ఈ ప్యాకెట్లన్నీ అమ్ముడయ్యాయి. దీంతో మరో 10 వేల ప్యాకెట్లు తయారు చేయించి, కౌంటర్లలో ఉంచినట్లు అధికారులు తెలిపారు.



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 – 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	25,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

రూ.6 లక్షల విలువైన సొత్తు రికవరీ

తాళ్లపూడి (కొవ్వూరు): ఈ నెల 8వ తేదీ రాత్రి కొవ్వూరు పట్టణం సంస్కృత పాఠశాల దగ్గర ఉన్న తొండ్రంకి కురిమిశెట్టికి చెందిన కూల్ డ్రింక్, కూరగాయల షాపులో జరిగిన దొంగతనం కేసును పట్టణ పోలీసులు ఛేదించారు. సీఐ విశ్వం ఆదివారం వివరాలు తెలిపారు. 12వ తేదీ ఉదయం 8 గంటల సమయంలో కొవ్వూరు పట్టణం నందమూరు రోడ్డులో బుద్ధుని బొమ్మ సెంటర్ వద్ద ఈ కేసులో ముగ్గురు ముద్దాయిలను అరెస్టు చేశామని చెప్పారు. వారి వద్ద నుంచి ఈ కేసులో చోరీకి గురైన కొంత సొత్తు, ఇతర కేసులకు సంబంధించిన 5 మోటారు సైకిళ్లు, ఆండ్రాయిడ్ ఫోన్, జత వెండి పట్టీలు, బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కొవ్వూరు మండలం వేములూరుకు చెందిన రాజమహేంద్రవరం సమీపంలోని నామవరం, ఎ బ్లాకులో ఉంటున్న గుడ్ల సతీష్(పకోడి), అదే ప్రాంతానికి చెందిన తమ్మిశెట్టి సాయి, రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరుకు చెందిన బొండపల్లి అచ్యుత్ సతీష్‌ను అరెస్టు చేసినట్టు తెలిపారు. 8వ తేదీ రాత్రి షాపు తాళాలు పగులగొట్టి రూ.3 వేల నగదు, 2.5 లీటర్ల కూల్ డ్రింక్ కేసులు–9, హోమ్ థియేటర్ సెట్–1 కొన్ని సిగరెట్ ప్యాకెట్లు దొంగిలించారని తొండ్రంకి కురిమిశెట్టి ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేసినట్టు సీఐ తెలిపారు. కేసును ఛేదించిన సీఐ విశ్వం, కొవ్వూరు టౌన్ ఎస్సై రవీంద్ర బాబు, సిబ్బంది అప్పారి బేగ్, అనిల్ కుమార్, కోట సత్యనారాయణ, జయరాం, గణేష్‌లను ఎస్పీ డి.నరసింహకిషోర్ అభినందించారు.

వైవిధ్య వరితం!

- నారు, తడి లేని పంట!
- ఆరుతడి పంటగా వరి సాగు
- ప్రకృతి వ్యవసాయంలో ప్రయోగాత్మకంగా..
- పెట్టుబడి తక్కువ ఆదాయం ఎక్కువ వచ్చేలా కృషి
- కాకినాడ జిల్లా వెల్దుర్తిలో సాగు ప్రారంభం



ఆరుతడి పంటకు విత్తన శుద్ధి చేస్తున్న సిబ్బంది

పిఠాపురం: నీటి వినియోగంతో సాగయ్యే పంట కావడంతో వరికి వాతావరణ పరిస్థితులు శాపంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో నారు పోసి నాట్లు వేయడం కన్నా నేరుగా విత్తుకోవడం మేలని శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖాధికారులు అంటున్నారు. దీంతో ఆరుతడి పంటగా వరిని సాగు చేసే పద్ధతికి ప్రకృతి వ్యవసాయ శాఖాధికారులు శ్రీకారం చుట్టారు. తక్కువ పెట్టుబడితో నారు నీరు లేకుండా, కూలీలతో పని లేకుండా రైతులు నేరుగా వరి సాగు చేస్తున్నారు. ఆరుతడి పంటలు అంటే కేవలం వాణిజ్య పంటలు మాత్రమే గుర్తుకు వస్తాయి. కాని మెట్ట ప్రాంతంలో నీరు అంతగా అందని పొలాల్లో వాణిజ్య పంటలకు బదులుగా వరి సాగు చేసే విధానాన్ని అధికారులు ప్రారంభించారు. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తూ ఆరుతడి పద్ధతిలో వరి సాగును ప్రారంభించారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం వెల్దుర్తిలో ప్రకృతి వ్యవసాయ శాఖ డీపీఎం ఎలియాజరు నేతృత్వంలో ఈ పద్ధతిని ప్రయోగాత్మకంగా ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది ప్రారంభించారు.



పాడి-పంట

నష్టాల సాగుకు చెక్ పెట్టాలని..

వర్షాలు సరైన సమయంలో కురవక పోవడం తద్వారా కాలువల్లో సాగు నీరు ఆలస్యంగా విడుదల అవ్వడం వల్ల వరి సాగు కత్తిమీద సాముగా మారింది. దీంతో నారు మడులు పోసుకోవడం, నాట్లు వేయడం నిర్ణీత సమయానికి వీలు పడడం లేదు. దీనివల్ల పంటలు ఆలస్యం అవ్వడంతో పాటు ప్రకృతి వైపరీత్యాలకు బలవుతున్నాయి. ఆరుగాలం కష్టించి పండించినా రైతులు నష్టాల పాలవుతున్నారు. వ్యవసాయం చేయడం దండగ అనే నిరాశ రైతులను ఆవహిస్తోంది. చెరువులు, కాలువలు, నీటి వనరులపై ఆధారపడి పండించే పంటలు ఇప్పుడు భూగర్భ జలాల మీద ఆధారపడాల్సిన పరిస్థితులు వచ్చేశాయి. అయితే కొన్నిచోట్ల భూగర్భ జలాలు అందుబాటులో ఉండడం లేదు. దీనికి తోడు కూలీల కొరత, అధిక కూలీ రేట్లు వంటి సమస్యలకు చెక్ పెడుతూ తక్కువ పెట్టుబడితో తక్కువ నీటి వసతితో ఎక్కువ లాభాలు వచ్చే ఆరుతడి వరి సాగుకు రైతులను అధికారులు సంసిద్ధం చేశారు.

ఆరుతడితో అన్నీ లాభాలే

ఆరుతడి పద్ధతిలో సాగు చేసిన వరి.. మామూలు పంట కంటే 15 రోజుల ముందుగానే కోతకు వస్తుంది. పంట దిగుబడి 15 శాతం పెరుగుతుంది. కూలీల ఖర్చులు అవసరం లేదు. సాగు నీటి వసతి అంతంత మాత్రమే సరిపోతుంది. దీంతోపాటు నారుమడి తయారు చేయాల్సిన అవసరం, నారు వేసే ఖర్చు లేదు. నారు తీసే ఖర్చు ఉండదు. దీనివల్ల ఎకరానికి సుమారు రూ.10 వేలు మిగులుతాయి. ఈ పంట సాగుకు ఎక్కువ నీరు అవసరం ఉండదు. కేవలం వర్షం నీరు సరిపోతుంది. వేసవిలో దుక్కి అయిన తరువాత వర్షం పడినప్పుడు నేరుగా యంత్రాలతో ఎరువులు, విత్తనాలు పొడిగా ఉన్నప్పుడే చల్లుకోవచ్చు. అదే నారుమడి తయారీకి అయితే ఎకరానికి సుమారు 30 కేజీల విత్తనం అవసరం అవుతుంది. ఆరుతడి పంటకు అయితే కేవలం 15 కేజీల విత్తనంతో ఒక ఎకరం సాగు చేసుకోవచ్చు. దీనివల్ల సుమారు 15 కేజీల విత్తనాలకు పెట్టే ఖర్చు తగ్గుతుంది. ఆరుతడిలో వరుసల క్రమంలో దుబ్బుకు దుబ్బుకు మధ్య దూరం సమంగా ఉండడం వల్ల గాలి,వెలుతురు బాగా తగిలి పంట దిగుబడి మామూలు దాని కంటే ఎక్కువ వస్తుంది. తెగుళ్ల అంతగా సోకే ప్రమాదం కూడా ఉండదు.



పిఠాపురం మండలం వెల్దుర్తిలో ఆరుతడి పంటగా వరి సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది

ప్రయోగాత్మకంగా చేపట్టాను



నేను 11 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. ఇప్పటి వరకూ అన్ని రకాల పంటలు వేసి మంచి దిగుబడులు సాధిస్తున్నాను. ఇటీవల నీటి ఎద్దడిని అధిగమించేలా ఆరుతడి పద్ధ**తిలో వరి సాగు చేసే** విధానాన్ని నా వ్యవ**సాయ క్షేత్రంలో చేపట్టా**ను. దీంతో మా **పొలంలో ఒక ఎకరంలో** ఈ పద్ధతిలో వరి **సాగు చేశాం. దుక్కి దు**న్నిన పొలంలో **ఎటువంటి తడి లేకుం**డా పొడి విత్తనాలను **సాగు చేశాం.**

– **పాటి శ్రీనివాసు,** ప్రకృతి వ్యవసాయ రైతు, **వెల్దుర్తి**, పిఠాపురం మండలం

ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో..



ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఆరుతడి వరి సాగు ప్రారంభించాం. వీటికి దేశీయ వరి రకాలైన నవారా, మైసూర్ మల్లిక, నారాయణ కామిణి, చిట్టి ముత్యాలు మోడల్ వేయించాం. ప్రస్తుతం నీటి ఎద్దడి అధికంగా ఉండడంతో ఈ పద్ధతిని అమలులోకి తీసుకువచ్చాం. ముందుగా ప్రధాన పొలంలో 400 కేజీల బయోచారు కలిపిన ఘనజీవామృతం వేయించాం. విత్తనాలు బీజామృతంతో విత్తన శుద్ధి చేసి, విత్తనానికి విత్తనానికి మధ్య దూరం 25 సెంటీమీటర్లు ఉండేలా నాటించాం. నాలుగు వరుసలు వరి విత్తనాలు నాటిన తర్వాత ఒక వరుస ఆకుకూరలు, మళ్లీ నాలుగు వరుసలు వరి విత్తనాలు మళ్లీ కాయగూరలు 4:1 నిష్పత్తిలో నాట్లు వేయించాము. ఈ సాగు పద్ధతుల్లో ప్రధానంగా నీటిని ఆదా చేయవచ్చు. వర్షాభావ పరిస్థితుల్లో కూడా ఈ పద్ధతిలో సాగు చేయవచ్చు. విభిన్న రకాల పంటలు వేయడం వలన పురుగులు, తెగుళ్ల ఉధృతిని అరికట్టవచ్చు. ప్రధాన పంట ఆదాయంతో పాటుగా అంతర పంటల వల్ల ఆదాయం పొందవచ్చు. రైతుకి పెట్టుబడి తగ్గడంతో పాటుగా ఆదాయం పెరుగుతుంది. ఈ పద్ధతిలో రసాయనిక ఎరువులు, పురుగుమందులకు బదులుగా, గో ఆధారతమైన బీజామృతం, జీవామృతం, ఘనజీవామృతం, వృక్ష సంబంధమైన కషాయాలు ఉపయోగించి పంటలు పండించడం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు అందుబాటులోకి తీసుకురావచ్చు. వీటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో రైతుకు మంచి ఆదాయం కూడా సమకూరుతుంది. జిల్లాలో పిఠాపురం మండలం వెల్దుర్తిలో ప్రయోగాత్మకంగా సాగు చేపట్టాం. త్వరలో జిల్లాలో ఇతర ప్రాంతాల్లోనూ దీనిని అమలు చేసే విధంగా రైతులను సంసిద్ధం చేస్తున్నాం.

– **ఎలియాజరు,** ప్రకృతి వ్యవసాయ శాఖ జిల్లా మేనేజర్, కాకినాడ

జైలుకు లైంగిక వేధింపుల నిందితులు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో పారామెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ ల్యాబ్ అటెండెంట్ వాడ్రేవు కళ్యాణ్ చక్రవర్తి, ల్యాబ్ టెక్నీషియన్లు బోడే జిమ్మీరాజు, సరిపల్లి గోపాలకృష్ణ, కొప్పిశెట్టి వీరవెంకటసత్యనారాయణ ప్రసాద్‌లకు ఆదివారం కాకినాడ సెకండ్ ఏజేఎఫ్‌సీఎం కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. శుక్రవారం కాకినాడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి థర్డ్ ఏజేఎఫ్‌సీఎం కోర్టు ముందు హాజరుపరచగా మేజిస్ట్రేట్ రూ.20 వేలు వ్యక్తిగత పూచీకత్తుతో 41ఏ నోటీసు ఇచ్చి విడిచిపెట్టారు. రామకృష్ణారావుపేటకు చెందిన ఓ బాలిక ఫిర్యాదుతో కాకినాడ టూ టౌన్ పీఎస్‌లో కేసు నమోదు కాగా, ఈ కేసులో ఆదివారం మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో నిందితులు కళ్యాణ్ చక్రవర్తి, జిమ్మీరాజు, గోపాలకృష్ణ, ప్రసాద్‌లను పోలీసులు కాకినాడ సబ్ జైలుకు తరలించారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం సిటీ: గోదావరి రైల్వే స్టేషన్ – రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌ల మధ్య సుమారు 55 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి ట్రాక్‌పై మృతి చెంది ఉన్నాడని రాజమహేంద్రవరం జీఆర్పీ ఎస్‌ఐ లోవరాజు ఆదివారం తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ మార్చురీకి తరలించామన్నారు. మృతుడి ఒంటిపై బ్రౌన్ కలర్ చొక్కా, బ్లాక్ ప్యాంట్ ఉన్నాయని, చెవికి పోగులు ఉన్నాయని చెప్పారు. పై వ్యక్తి గురించి ఏదైనా సమాచారం ఉంటే సీఐ 9440627551,ఎస్ఐ–9491444022, నంబర్లకు తెలియజేయాలన్నారు.

ఇంటికి వెళుతూ వృద్ధుడి మృతి



రాముడు మృతదేహం

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలోని రాజానగరం వెళ్లే బస్సు స్టాప్ వద్ద వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం బలభద్రపురం గ్రామంలోని రాజానగరం బస్‌స్టాప్ వద్ద గుర్తు తెలియన వృద్ధుడు మృతి చెందినట్లు వాట్సాప్ గ్రూప్ ద్వారా సమాచారం అందిందన్నారు. మృతుడు కొత్తపల్లి మండలం పాత ఇసుకపల్లి గ్రామానికి గంపల రాముడు (79)గా గుర్తించారు. అతను అనపర్తి మండలం పులగుర్త గ్రామంలోని ఇటుకల బట్టీలో పనిచేస్తున్నట్లు, సైకిల్‌పై ఇంటికి వెళుతూ బలభద్రపురం వచ్చిన తరువాత ఒక్కసారిగా పడిపోయి మృతి చెందినట్లు తెలిపారు. అతని కుమారుడు నానాజీ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని అనపర్తి సీహెచ్‌సీ తరలించినట్లు తెలిపారు.

ఇరిగేషన్ డీఈఈ శ్రీనివాసరావుపై లైంగిక వేధింపుల కేసు

అమలాపురం టౌన్: అమలాపురం ఇరిగేషన్ కార్యాలయంలో డీఈఈగా పనిచేస్తున్న శ్రీనివాసరావు తనను ఉద్యోగ పరంగానూ, లైంగికంగానూ వేధిస్తున్నారని అదే కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న ఓ మహిళ పట్టణ పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరిగేషన్ డీఈఈ శ్రీనివాసరావుపై శనివారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. గత ఏడాది డిసెంబర్ నుంచి తనను డీఈఈ వేధిస్తున్నారని ఆమె ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ

సీతానగరం: మండలంలోని రఘుదేవపురం రవీంద్ర కాలనీలో తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ జరిగిందని ఎస్సై డి.రామ్ కుమార్ ఆదివారం తెలిపారు. సురవరపు మణికంఠ అక్క నిడదవోలులో ఉంటున్నారు. రెండు వారాల క్రితం ఇంటికి తాళం వేసి అక్కడికి వెళ్లారు. శనివారం తిరిగి ఇంటికి రాగా తాళం బద్దలు కొట్టి ఉంది. లోపల సామాన్లు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. అది చూసిన మణికంఠ పోలీసులకు సమాచారం అందించాడు. నాలుగు కాసుల బంగారు బిస్కట్, 90 తులాల వెండి, రూ.3.90 లక్షల నగదు పోయిందని గుర్తించారు. ఎస్సై ఆదేశాలతో హెడ్ కానిస్టేబుల్ శ్రీను సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. క్లూస్ టీమ్ ఆధారాల కోసం పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆస్తి తగాదాలో ఒకరికి కత్తిపోట్లు

కరప: గ్రామంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఆస్తి తగాదాలో ఒకరు కత్తిపోట్లకు గురికాగా, కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప పోలీసులు కేసు నమోదు చేశారు. కరప గ్రామం మెరకవీధిలో బేరి రామకృష్ణ కింది పోర్షన్‌లోను, బేరి రాజ రాజేశ్వరి పైపోర్షన్‌లోను నివాసం ఉంటున్నారు. వీరిద్దరి మధ్య కొంతకాలంగా ఆస్తి విషయమై వివాదం జరుగుతోంది. ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో బేరి రామకృష్ణ వియ్యంకుడు అమజాల వీరరాఘవ బిక్కవోలు నుంచి భోజనం క్యారేజీ పట్టుకుని వచ్చారు. అదే సమయంలో రాజరాజేశ్వరి ఆస్తి తగాదా విషయంపై రామకృష్ణతో గొడవ పడుతుండగా రాఘవ కూడా ఆ గొడవలో కలగచేసుకున్నారు. రాజరాజేశ్వరి కుమారుడు చంద్రశేఖర్ అక్కడకు వచ్చి రామకృష్ణ, రాఘవలతో వాగ్వాదానికి దిగాడు. వారిద్దరిని చంపాలనే ఉద్దేశంతో చంద్రశేఖర్ దగ్గరలో ఉన్న కత్తిని తీసుకొచ్చి రాఘవ ఎడమ చేతిపై రెండుచోట్ల నరికాడు. చుట్టుపక్కలవారు వచ్చి రాఘవను కాపాడి, చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎంఎల్‌సీ స్టేట్‌మెంట్‌పై కరప ఎస్ఐ టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోట శ్రీనివాసరావుతో ఏరా ఏరా అనుకునే స్నేహం

నటుడు, గాయకుడు జిత్‌మోహన్‌మిత్రా

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కోట శ్రీనివాసరావు మరణం పట్ల నట గాయకుడు శ్రీపాద జిత్‌మోహన్‌మిత్రా తీవ్ర సంతాపం తెలిపారు. 'కోట, నేను కలిసి దగ్గరగా 50 సినిమాలు చేశాం. ప్రాణం ఖరీదు, బాబాయి అబ్బాయి, అలీబాబా అరడజను దొంగలు, ఏవండీ ఆవిడ వచ్చింది, హైహై నాయక, చిన్నబ్బాయి, 420, కత్తి కాంతారావు తదితర చిత్రాలు అందులో ఉన్నాయి. ఏరా ఏరా అనుకునేంత స్నేహం ఉంది. రాజమండ్రిలో నా ఆర్కెస్ట్రా 25వ వార్షికోత్సవానికి కోటశ్రీనివాసరావు హాజరై స్టేజ్‌పై మిమిక్రీ చేశాడు. చాలా గొప్ప కళాకారుడు, విలక్షణ నటుడు, మంచి వ్యక్తి. ఆయన చనిపోవటం తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటు. ఆయనకు సద్గతులు కలగాలని కోరుకుంటూ, వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి' అని ఆయన పేర్కొన్నారు.

అన్నపూర్ణ టాకీస్‌ను సందర్శించిన 'కోట'

అమలాపురం రూరల్: అప్పట్లో కోట శ్రీనివాసరావు అమలాపురం మండలం సమనసలోని స్టేట్‌బ్యాంకుకు విచ్చేశారు. ఆయన సినిమాల్లోకి రాకముందు బ్యాంకు ఉద్యోగిగా పనిచేశారు. ఉద్యోగిగా పనిచేస్తున్న సమయంలో అమలాపురం మండలం సమనసలోని స్టేట్ బ్యాంకుకు విచ్చేశారు. అక్కడ బ్యాంకు మేనేజర్‌ను కలిసిన సందర్భంగా అప్పటి సర్పంచ్ మామిళ్లపల్లి రాజారావును కలుసుకుని ఆయన నడుపుతున్న అన్నపూర్ణ టాకీస్‌ను సందర్శించారు. అన్నపూర్ణ టాకీస్ వద్ద కోటను సర్పంచ్ రాజారావు ఆధ్వర్యంలో సత్కరించారు. అప్పట్లో కోట శ్రీనివాసరావు ను చూసేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి వందలాది మంది తరలివచ్చారు. 1987 లో ఈ ఘటన చోటుచేసుకోగా ఆ సమయంలో అన్నపూర్ణ టాకీస్‌లో ప్రతిఘటన సినిమా ఆడుతోంది. కోట శ్రీనివాసరావు ఆదివారం మృతి చెందడంతో ఆయనతో ఉన్న అనుబంధాన్ని మాజీ సర్పంచ్ మామిళ్లపల్లి రాజారావు గుర్తు చేసుకుని ఆయన మృతికి సంతాపం తెలిపారు.

భలే ఖైదీలు షూటింగ్‌లో కోటతో శ్రీరామ వరప్రసాద్

రాంకీ నిరోషా హీరో హీరోయిన్లుగా బీవీఎల్.వి.ప్రసాద్ దర్శకత్వంలో తెరకెక్కిన భలే ఖైదీలు సినిమా షూటింగ్ 1992లో కాకినాడలో జరిగింది. ఈ సినిమాలో కైకాల సత్యనారాయణ, కోట శ్రీనివాసరావు కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాలో కీలక సన్నివేశాలను కాకినాడలో చిత్రీకరించారు. ఈ చిత్రంలో ప్రైవేట్ బస్సు కండక్టర్‌గా అమలాపురం మండలం సవరప్పాలెం గ్రామానికి చెందిన సత్తి శ్రీరామవరప్రసాద్ నటించారు. కోట శ్రీనివాసరావు, సత్యనారాయణతో కలిసి నటించిన సన్నివేశాలు ఇప్పటికీ మర్చిపోలేనని శ్రీరామ వర ప్రసాద్ తెలిపారు.



కత్తి కాంతారావు సినిమా షూటింగ్‌లో కోటతో జిత్‌మోహన్ మిత్రా (ఫైల్)



జిత్‌మోహన్‌మిత్రా ఆర్కెస్ట్రా 25వ వార్షికోత్సవంలో కోట శ్రీనివాసరావు, జిత్ (ఫైల్)



అన్నపూర్ణ టాకీస్ వద్ద కోట శ్రీనివాసరావు సత్కరిస్తున్న మాజీ సర్పంచ్ రాజారావు



కోట శ్రీనివాసరావు కలిసి నటించిన సవరప్పాలెం గ్రామానికి చెందిన శ్రీరామ వరప్రసాద్

'కోట'కు చిత్ర నీరాజనం



అంజి గీసిన కోట శ్రీనివాసరావు చిత్రం

కాట్రేనికోన: ప్రముఖ చలన చిత్ర నటుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత కోట శ్రీనివాసరావు శివైక్యం చెందడంతో కాట్రేనికోనకు చెందిన చిత్రకారుడు ఆకొండి అంజి, సినీ నటుడు పెద్దింటి సురేష్ సంతాపం తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు, తమిళ, కన్నడ భాషలలో సమారు 700లకు పైబడి చిత్రాలలో నటించి ప్రేక్షకుల మన్ననలు పొందిన కోట శ్రీనివాసరావు మృతి చలన చిత్ర పరిశ్రమకు తీరని లోటు అన్నారు. ఆయన మృతికి సంతాపంగా చిత్రకారుడు ఆకొండి అంజి చిత్ర నీరాజనం తెలుపుతూ కోట శ్రీనివాసరావు చిత్రాన్ని గీశారు.

ఘనంగా కవలల సమ్మేళనం

దక్షిణాది రాష్ట్రాల నుంచి 108 మంది హాజరు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కవల పిల్లల పెంపకం, వారి జీనవ విధాన శైలి తదితర అంశాలను తెలియజేయాలని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ క్లబ్ సరికొత్త కార్యక్రమానికి నాంది పలికింది. దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న 108 కవల పిల్లల జంటలను ఒకే చోట ఉంచి వారి ప్రతిభ పాటవాలను వెలికితీయడానికి కాకినాడ సూర్యకళా మందిరం ఆదివారం వేదికగా నిలిచింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వివిధ కార్యక్రమాలతో సందడి చేశారు. వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ చైర్‌పర్సన్, అడ్మిన్ వైస్ ప్రెసిడెంట్ ప్రెసిడెంట్ నాళం అండాళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎరుకుల రామకృష్ణ, జిల్లా గవర్నర్ బంగ్రరాజు, వైస్ ప్రెసిడెంట్ సిద్దా వెంకటసూర్యప్రకాశరావులు హాజరై వాసవీ క్లబ్ ఆశయాలు, విశిష్టత తెలియజేశారు. కవల పిల్లలకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసి వారి ప్రతిభను కొనియాడారు. అనంతరం ఇద్దరు విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా సుచిత్ర, చావలిసూర్యకుమారి, రాజ్యలక్ష్మి వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు. క్లబ్ ఇంటర్నేషనల్ కార్యదర్శి గర్లపాటి శ్రీనివాసులు, బొడా సాయిసూర్యప్రకాష్, సూజాత, గ్రంధి బాబ్జి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



కవల జంటలకు బహుమతులు అందజేసిన వాసవీ క్లబ్ సభ్యులు

మాణిక్యాంబా అమ్మవారికి ఆషాఢం సారె



శాకంబరిగా మాణిక్యాంబ అమ్మవారు



శోభాయాత్రగా మాణిక్యాంబ అమ్మవారికి సారె తీసుకువస్తున్న భక్తులు

రామచంద్రపురం రూరల్: పంచారామాల్లో ఒకటిగా, త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా, అష్టాదశ శక్తి పీఠాల్లో 12 వ శక్తి పీఠంగా అలరారుతున్న ద్రాక్షారామలో మాణిక్యాంబా అమ్మవారికి భీమేశ్వరస్వామి దేవస్థానం ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో ఆదివారం ఆషాఢం సారెను అందజేశారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకు కూరలతో శాకంబరిగా అలంకరించారు. ద్రాక్షారామకు చెందిన స్వీట్ స్టాల్ అధినేత కంచెర్ల చక్రధరరావు(చక్రి) సుమారు 150 కేజీల వివిధ రకాల స్వీట్లు అమ్మవారికి సారెగా సమర్పించారు. పలువురు మహిళా భక్తులు స్వీట్లు, పండ్లు అమ్మవారికి సారె తీసుకువచ్చారు. అమ్మవారి పుట్టిల్లు అయిన వేగాయమ్మపేట నుంచి శోభాయాత్రగా మంగళ వాయిద్యాలు, వేద మంత్రాలతో సారెను తోడ్కొని వచ్చారు. రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్, వేగాయమ్మపేట జమీందార్ వాడ్రేవు సుందర రత్నాకరరావు, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో మందుబాబుల హల్‌చల్

అమలాపురం టౌన్: అమలాపురం నుంచి కాకినాడ మీదుగా విశాఖపట్నం వెళుతున్న ఆర్టీసీ బస్సులో ఎనిమిది మంది మద్యం సేవించి హల్‌చల్ చేశారు. తోటి ప్రయాణికులు ఇబ్బంది పడేలా నానా యాగీ చేశారు. ఆదివారం రాత్రి వీరు బస్సులో అమలాపురం నుంచి విశాఖపట్టణం బయలు దేరారు. మద్యం సేవించిన ఎనిమిది మందిలో నలుగురు మద్యాన్ని విపరీతంగా తాగి స్పృహ కోల్పోయి బస్సులోని సీట్ల మధ్య ఉండే ఖాళీ ప్రదేశాల్లో పడుకున్నారు. తోటి ప్రయాణికులు వీరి మందు చేష్టలకు విసుగుచెంది అలాగే ఉండిపోయారు. మందుబాబుల నిర్వాకానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. రాత్రి తొమ్మిది గంటల సమయంలో బస్సు కాకినాడ నగరాన్ని దాటి విశాఖ వైపు బయలుదేరింది.